# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో భూకబ్జా నిరోధక చట్టాన్ని వెంటనే ఆమోదించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు.**
2. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంకోసం ప్రజలపై భారం మోపబోమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టంచేశారు.**
3. **సికింద్రాబాద్‌లో ఎల్లుండి జరిగే మహిళా సదస్సులో మహిళా శక్తి పాలసీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విడుదల చేస్తారని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి ఎ.శాంతికుమారి తెలిపారు.**
4. **భూపరిపాలన చట్టాలపై అధ్యయనం చేసి సవరణలను సిఫార్సు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది.**
5. **కౌలు రైతులకూ అన్నదాతా సుఖీభవ పథకం కింద లబ్ధి చేకూర్చే విషయమై కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**

=========================

ఆంధ్రప్రదేశ్‌లో భూకబ్జాల నిరోధానికి రూపొందించిన భూకబ్జా నిరోధక చట్టానికి వెంటనే ఆమోదముద్ర వేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా నిన్న ఆయన పలువురు కేంద్రమంత్రులతో సమావేశమయ్యారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు, పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుకు ఆర్థికసాయం అందచేయాలని ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, హైదరాబాద్– బందరు పోర్టు మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతోపాటు మరికొన్ని జాతీయ రహదారుల గురించి కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించారు. అనంతరం చంద్రబాబునాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో రాజకీయ అంశాలు, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై చర్చించానని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ నీరు అందుతుందని ముఖ్యమంత్రి వివరిస్తూ..

.. వాయిస్..40 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రజలపై భారం మోపబోమని రాష్ట్ర పురపాలక శాఖ

మంత్రి పి.నారాయణ స్పష్టంచేశారు. ప్రజలు కట్టే పన్నుల నుంచి రాజధాని నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా వినియోగించబోమని ఆయన వెల్లడించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు పట్టణంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. 64 వేల కోట్ల రూపాయల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే 50 వేల కోట్ల రూపాయల విలువైన పనులకు టెండర్లు పిలిచామని మంత్రి నారాయణ వివరిస్తూ..

..వాయిస్.. 38 సెకన్లు

---

సికింద్రాబాద్‌లో ఎల్లుండి జరిగే మహిళా సదస్సులో మహిళా శక్తి పాలసీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విడుదల చేస్తారని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి ఎ.శాంతికుమారి తెలిపారు. సదస్సు ఏర్పా ట్లపై నిన్న ఆమె సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనే అవ కాశం ఉన్నం దువల్ల పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేది కల నిర్మాణం, బారికేడ్లు, లైటింగ్, పార్కింగ్, సీటింగ్ తదితర పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని ప్రభుత్వ ప్రధాన కార్య దర్శికి అధికారులు తెలిపారు.

---

తెలంగాణాలో ఉత్కంఠ భరితంగా సాగిన శాసనమండలి పట్టభద్రుల ఎన్నికలో భారతీయ జనతా పార్టీ విజయం సాధించింది. ఉమ్మడి కరీంనగర్– ఆదిలాబాద్– నిజామాబాద్– మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఆ పార్టీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిపై 5 వేల 106 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలింది. ఈ స్థానంలో మొత్తం 56 మంది పోటీ చేశారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో భూపరిపాలన చట్టాలపై అధ్యయనం చేసి సవరణలను సిఫార్సు చేసేందుకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీలో ఆర్థిక, పురపాలక, పరిశ్రమలు, దేవదాయ, న్యాయశాఖ మంత్రులు సభ్యులుగా ఉంటారు. భూపరిపాలనకు సంబంధించిన వివిధ చట్టాలు, నిబంధనలపై సమగ్ర అధ్యయనం చేసి అవసరమైన సవరణలను సూచించడంతోపాటు నాలా, ఓటీసీ విధానానికి తుదిరూపు ఇవ్వాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది.

---

కౌలు రైతులకూ అన్నదాతా సుఖీభవ పథకం కింద లబ్ధి చేకూర్చే విషయమై కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. అన్నదాతా సుఖీభవ పథకంపై శాసన మండలిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిన్న సమాధాన మిస్తూ.. రాష్ట్రంలో 90 శాతం మంది కౌలు రైతులు ఉన్నారని, వారికీ సాయం అందించాలని కేంద్రాన్ని కోరామన్నారు. ఈ–పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి సాయం అందించే విషయాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2025–26 బడ్జెట్‌లో ఈ పథకం అమలుకు 9 వేల 400 కోట్ల రూపాయలు ప్రతిపాదించామని అచ్చెన్నాయుడు తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు ఇంటర్ మొదటి సంవత్సరం గణితం పేపర్ -1ఎ, బోటనీ పేపర్-1, సివిక్స్ పేపర్-1 పరీక్షలకు సెట్ నెంబరు 2 ఎంపిక చేశారు.

---------------------------

భారత్‌ను అంతర్జాతీయ వినోద రంగానికి కేంద్రంగా మార్చేందుకు, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్ టెయిన్ మెంట్-వేవ్స్ 2025 సదస్సును ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్స్‌లో మే 1 నుంచి 4వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దేశంలో మీడియా- వినోదరంగం అభివృద్ధి, వాణిజ్యపరమైన అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సృజనాత్మక, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో. “క్రియేట్ ఇన్ ఇండియా” పేరుతో 31 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటివరకు 70 వేల మంది తమ వివరాలను నమోదు చేసుకోవటం విశేషం.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటకులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి, అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని ఆయన వెల్లడించారు. బెర్లిన్‌లో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ బిజినెస్ ట్రేడ్‌లో మంత్రి నిన్న ప్రసంగిస్తూ.. వ్యాపారాన్ని సులభతరం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దుర్గేష్ కోరారు.

---------------------------

ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో ఉపాధి హామీ పథకంలో ‘వాటర్ బెల్’ విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. పనులకు హాజరయ్యే శ్రామికులకు గంటకోసారి నీళ్లు సేవించేలా పని ప్రదేశాల్లో ఏర్పాట్లు చేయాలని, నీడ నిచ్చే షెడ్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండాలని పేర్కొంది. వేసవిలో పని ప్రదేశాల్లో ఉపాధి శ్రామికుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించారు. వీటిని వెంటనే అమలు చేయాలని జిల్లా జల యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లను ఆయన ఆదేశించారు.

======================